సాగర తీరంలో భక్తుల ఇలవేల్పు

• కాటేపల్లిలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

తోటపల్లిగూడూరు: మండలంలోని సాగర తీరాన కాటేపల్లిలో కొలువైన పుణ్యక్షేత్రంలో భక్త జనుల ఇలవేల్పు కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 26న మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. కాటేపల్లి శివాలయం ప్రాచుర్యాన్ని పొందింది. ఏటా జరిగే మహా శివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుండడం విశేషం. భక్తులు ఆలయలంలో జాగరణ, వేకువన తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు.

70 మందితో బందోబస్తు

కాటేపల్లి శివరాత్రి ఉత్సవాలకు కృష్ణపట్నం పోర్టు సీఐ, నలుగురు ఎస్సైలతోపాటు 70 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు బందోబస్తు ఉంటుంది. స్థానిక ఎస్సై వీరేంద్రబాబు మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కాటేపల్లిలో జరగునున్న శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నట్లు ఆ డిపో సిబ్బంది తెలిపారు. ఈ నెల 26, 27వ తేదీల్లో డిపో నుంచి 10 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతి 10 నిమిషాలకు కాటేపల్లి శివాలయానికి ఆర్టీసీ సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



తోటపల్లిగూడూరు: కాటేపల్లి సముద్రతీరాన కొలువైన కామాక్షి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

ముత్తుకూరు: మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని శ్రీపార్వతీ పరమేశ్వరుల ఆలయాల్లో ముస్తాబవుతున్నాయి. కృష్ణపట్నంలోని చారిత్రక సిద్ధేశ్వరాలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మదేవిలోని కైలాస నాథేశ్వరాలయం, వల్లూరు, పిడతాపోలూరు, ముత్తుకూరు, పోలంరాజుగుంట, పైనాపురంలోని భోగేశ్వరాలయం, ఈపూరులోని విరూపాక్షేశ్వరాలయంలో ప్రత్యేక పూజలకు, గ్రామోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే మల్లికార్జునుడు

పొదలకూరు : మండలంలోని మరుపూరు శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా ప్రసిద్ధికెక్కారు. ఈ నెల 26న శివరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మహిమాన్వితమైన ఆలయం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కైలాసనాథుడిని దర్శించుకునేందుకు ఇక్కడకు విచ్చేస్తారు. ఉదయం స్వామి కొలువైన గర్భగుడిలోకి సూర్యకిరణాలు తాకడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకుంటారు. తోడేరు, సౌత్‌మోపూరు, ఉప్పుటూరు, పొదలకూరు తదితర ప్రాంతాల నుంచి మల్లికార్జునస్వామి దేవస్థానానికి విచ్చేసి భక్తులు తమ కోర్కెలను నెరవేర్చుకుంటున్నారు.

ప్రత్యేక పూజలు

ఈ నెల 26వ తేదీ మహా శివరాత్రి రోజున ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం, అన్నదాన కార్యక్రమం, రాత్రి వైభవంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ఉంటుందన్నారు.



పొదలకూరు: మరుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం



ముత్తుకూరు: కృష్ణపట్నంలోని చారిత్రక సిద్ధేశ్వరాలయం



ముస్తాబవుతున్న కామాక్షి సమేత రామలింగేశ్వరాలయం

భక్తుల కొంగుబంగారం రామలింగేశ్వరుడు

పొదలకూరు : వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన పొదలకూరులోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకుంటారు. శివరాత్రి నాడు రాత్రి ఇసుక వేస్తే రాలనంత జనం రద్దీ ఉంటుంది. ఇదే ప్రాంగణంలో పార్వతీ, పరమేశ్వరుల పుత్రుడైన గణనాథుడు విశేష పూజలందుకుంటున్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దేవదాయశాఖ అధికారులు అంగరంగ వైభంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25న సాయంత్రం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ, రావణసేవ, 26న రాత్రి నందిసేవ (మహా శివరాత్రి) 12 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 27న సాయంత్రం గిన్నెభిక్ష, 28న ఉదయం కల్యాణం, గజవాహనం, పారువేట, మార్చి 1న రాత్రి అలకల తోపు, 2న ఉదయం ధ్వజారోహణం, రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్ స్వామి, ఈఓ కావేరి ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.

క్లుప్తంగా

సింహవాహనంపై ఉదయకళేశ్వరుని విహారం



కొడవలూరు: మండలంలోని గండవరంలో కొలువైన ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సింహవాహనసేవను సోమవారం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య పర్యవేక్షించారు.

• బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను మంగళవారం నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభంకానున్నాయని చెప్పారు.

పరీక్షలకు ఇద్దరు విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్, నాల్గో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 57 మంది విద్యార్థులకు 55 మంది హాజరయ్యారని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

మనుబోలు: ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుని యూనిక్ ఐడీని కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం నిధుల విడుదల సందర్భంగా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని మనుబోలు, ఎల్ఎన్‌పురంలో రైతులతో కలిసి వీక్షించారు. ఎల్ఎన్‌పురంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాలు, రాయితీల ద్వారా రైతులు లబ్ధిపొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో 1,71,500 మందికి యూనిక్ ఐడీ (విశిష్ట సంఖ్య) నమోదు చేయడమే లక్ష్యమన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నెలాఖరులోపు యూనిక్ ఐడీని నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ షేక్ జహీర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శివనాయక్, నర్సోజీరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామకృష్ణనగర్‌లో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై సోమవారం విహరించారు. హంస వాహనంపై రాత్రి కొలువుదీరారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

పూరిల్లు దగ్ధం

కోవూరు: పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని జమ్మిపాళెం మిక్స్‌డ్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జమ్మిపాళేనికి చెందిన తాళ్లపాక శ్రీనివాసులు కుటుంబసభ్యులు ఆరు బయట వంటచేస్తున్న క్రమంలో ఒక్కసారిగా పొయ్యి నుంచి మంటలొచ్చాయి. ఎండిన తాటాకులకు నిప్పంటుకోవడంతో పూరిల్లు దగ్ధమైంది. మూడు సవర్ల బంగారు ఆభరణాలు, బీరువాతో పాటు రూ.60 వేల నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

పడారుపల్లిలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో అన్నదానాన్ని క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రుమటాలజిస్ట్ కురుమేటి కిశోర్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు.

మహాశివరాత్రి వేడుకలు రేపు

బుచ్చిరెడ్డిపాళెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జొన్నవాడలోని మల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో విశేష పూజలను బుధవారం నిర్వహించనున్నామని ఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు తదితరాలను నిర్వహించనున్నామని చెప్పారు. లింగోద్భవ కాల అభిషేకాన్ని రాత్రి 11కు నిర్వహించనున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని వివరించారు.



మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయం

సామూహిక సత్యనారాయణ వ్రతం

మనుబోలు: మాఘ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక శ్రీదేవి,భూదేవి సమేత విష్టాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ, నవగ్రహ పూజ, గణపతి పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు పెనుగొండ సుధాకర్, శాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఆచరిస్తున్న దంపతులు

బీసీ, ఓబీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

పొదలకూరు : బీసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్ సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 46 మందికి రుణాలను ప్రభుత్వం కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో ఓబీసీలకు 30, కాపులకు 5, కమ్మలకు 2, ఇతరులకు 9 సబ్సిడీ రుణాలను అందజేస్తామన్నారు. రుణాల కోసం మొత్తం 30 గ్రామ పంచాయతీల నుంచి 556 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైయ్యే అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్, జెరాక్స్ కాపీలను వెంట తీసుకురావాల్సిందిగా సూచించారు.

ఎంవీపాళెంలో సంసిద్ధత మేళా

ముత్తుకూరు: మండలంలోని ముసునూరువారిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల శిక్షణ సోమవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంసిద్ధత మేళా కార్యక్రమాన్ని ఎంఈఓ మధుసూదన్ ప్రారంభించారు. టీచర్లు తయారు చేసిన టీఎల్‌ఎంలను తిలకించి, ప్రశంసించారు. ఎంవీపాళెం, కొత్తపాళెం అంగన్‌వాడీ పిల్లలు, టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, హెచ్‌ఎం రమణయ్య, రీసోర్స్ పర్సన్ రజనీకర్ పాల్గొన్నారు.



టీఎల్‌ఎంలను పరిశీలిస్తున్న ఎంఈఓ మధుసూదన్

ఇజ్తిమా విజయవంతంపై కృతజ్ఞతలు

కొడవలూరు: ఇజ్తిమా విజయవంతానికి సహకరించిన వారికి ముస్లిం మైనార్టీ నేతలు కృతజ్ఞతలను తెలియజేశారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఇజ్తిమా నిర్వహించిన ప్రాంగణంలో విలేకరులతో సోమవారం వారు మాట్లాడారు. పూర్తి సహకారమందించిన వీపీఆర్ ఫౌండేషన్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నేతలు అందించిన సహకారం మరువలేనిదని కొనియాడారు. నేతలు జకీర్ షరీఫ్, సాబీర్‌ఖాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ప్రభుత్వ కళాశాలలో సరస్వతీ పూజ

పొదలకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సరస్వతీదేవి పూజ నిర్వహించారు. విద్యార్థుల పరీక్షల హాల్‌టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాల్సిందిగా సూచించారు. మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఉత్తీర్ణతా శాతం పెంపొందించాలన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు పరీక్షల సందర్భంగా పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న అధ్యాపకులు

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌గా నియమితులైన బాలకృష్ణను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. మోర్ల జయంతి, షాహుల్, షకీలా, బిట్రగుంట ప్రమీలమ్మ, యానాదిరెడ్డి, అనంతమ్మ, నేతలు పెంచలయ్య, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు ట్రెయినీ డీఎస్పీ

కోవూరు: శిక్షణ నిమిత్తం కోవూరు పోలీస్‌స్టేషన్‌కు ట్రెయినీ డీఎస్పీ శివప్రియ సోమవారం వచ్చారు. రెండు నెలల పాటు ఎస్‌హెచ్‌ఓగా ఆమె బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

భూ సమస్యలపై రైతుల వినతులు

పొదలకూరు: భూ సమస్యలపై పలువురు రైతులు ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖకు వినతులు అందజేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో రైతులు తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. వెంటనే పరిష్కరించగలిన వాటిని సంబంధిత వీఆర్వోకు అందజేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

వీధి లైట్లకు కరెంట్ కట్

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ పరిధిలో వీధి లైట్లకు విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీర్ఘకాలికంగా పంచాయతీకు సంబంధించి విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్న కారణంగా విద్యుత్‌ను నిలిపివేశారు. ఒక్క సారిగా వీధుల్లో అంధకారం నెలకొంది.

వీఆర్‌ఏ ఆత్మహత్య

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరుకు చెందిన వీఆర్‌ఏ జమీల్ బాషా (47) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. జమీల్ బాషా కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు మూడో మైల్లో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం క్రితం చిన్న కుమారుడు మున్నా ఆత్మహత్యకు చేసుకున్నాడు. అప్పటి నుంచి జమీల్‌బాషా తీవ్ర మనోవ్యధన పడుతున్నాడు. కొద్ది రోజులుగా సొంతూరుకు వెళ్తానని చెప్పడంతో పెద్ద కొడుకు రసూల్ ఆయన్ను ఇంటి సామానుతోసహా ఆదివారం వేకువ జామున లేబూరులో ఉన్న ఇంట్లో వదిలి పెట్టాడు. భార్య, కొడుకు కోడలు నెల్లూరులోని ఉండిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఫోను చేస్తే ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో పెద్ద కొడుకు ఊరిలో ఉన్న తమ స్నేహితుడిని ఇంటికి పంపించాడు. చూసే సరికి తలుపులు బిగించుకొని జమీల్‌బాషా ఇంటి శ్లాబు హుక్కుకు ఉరేసుకొని ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఉరేసుకున్న జమీల్‌బాషా

తప్పులను సరిచేసుకోవాలంటే.. వ్యక్తిగత దూషణలా..?



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: ప్లాట్ల విక్రయాల్లో జరిగిన తప్పును సరిచేయాలని చెప్తే, వ్యక్తిగత దూషణలు చేస్తారానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు ప్రశ్నించారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఒకే సర్వే నంబర్‌తో 137 మందికి ప్లాట్లు విక్రయించడంతో వారంతా నష్టపోతారని, సవరించుకోవాలని తాను సూచిస్తే ఆ విషయాన్ని పక్కనబెట్టి వ్యక్తిగత దూషణలతో విరుచుకుపడటం ఎంతవరకు సమంజసమని టీడీపీ నేతలను ప్రశ్నించారు. తాను అన్యాయంగా కోట్లు సంపాదించానంటూ నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 1998 నుంచి తాను కాంట్రాక్ట్ పనులు తదితర వ్యాపారాలు చేసి సంపాదించానే తప్ప, మీలా సర్వే నంబర్లు మార్చి, దేవాలయ ఆస్తులను స్వాహా చేయలేదని గుర్తుచేశారు. అన్నమయ్య గ్రీన్ వ్యాలీలో 2014లో డీటీసీపీగా లేఅవుట్‌ను కొందరికి రిజిస్టర్ చేశారని, అక్కడే 32 ప్లాట్లను ఇటీవల సాధారణ లేఅవుట్ కింద రిజిస్ట్రేషన్ చేశారని ఆధారాలను చూపారు. ఇలా చేయడంతో ప్లాట్లు కొన్న పేద, మధ్య తరగతి వారు లీగల్ ఒపీనియన్ రాక రుణాలు పొందలేక ఎంతో ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సరిచేసి ప్లాట్లు కొన్నవారికి న్యాయం చేయాలంటే కేసులు పెట్టిస్తామంటూ బెదిరింపులకు దిగడం ఇక్కడి టీడీపీ నేతలకే చెల్లుతుందన్నారు. ఇలాంటి వాటికి తాను భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం జరిగితే పార్టీ సహకారంతో పోరాటానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. నార్తురాజుపాళెంలో జరుగుతున్న వసూళ్ల పర్వంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కోరారు. వార్డు సభ్యులుగా గెలవని వారూ తనను విమర్శించడం బాధాకరమన్నారు. స్వాగత్ మహల్లో తట్ట అమ్ముకునే వ్యక్తి ఎర్రచందనంతో కోట్లు సంపాదించి తనను విమర్శించడమేమిటని ప్రశ్నించారు. ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బచ్చు సుప్రియ, పార్టీ నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, జడ్డా సాయికుమార్, తాటిపర్తి భాస్కర్, మోచర్ల రమేష్, కొడవలూరు మోహన్‌రావు, జనార్దన్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్‌లో ద్వితీయ స్థానం



కప్ అందుకుంటున్న విజేతలు

ముత్తుకూరు: తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. రాష్ట్ర స్థాయిలో పెద్ద సంఖ్యలో టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, తమ హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించడం గర్వంగా ఉందని హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీల్లో రక్షిత, గీత, మనోజిని, కావ్యశ్రీ తదితరులను ఆయన అభినందించారు. ఈ గెలుపునకు తోడ్పాటు అందించిన అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్‌రంజన్, కోచ్ కరీముల్లాకు కృతజ్ఞతలు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకం



కొడవలూరు: ప్రీ స్కూల్ పిల్లల అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎంఈఓ వసంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో జ్ఞానజ్యోతిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆమె సందర్శించారు. ప్రీ స్కూల్ పిల్లల సంసిద్ధత మేళాను నిర్వహించి, వారిని ఐదు రకాలుగా అభివృద్ధి చేసే టీచింగ్, లెర్నింగ్ మెటీరియళ్లను ప్రదర్శించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.